# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## ధరణి తీసేస్తే దరిద్రమే..



ధరణి తీసేస్తమని మాట్లాడేటోల్లకు ఒక్కటే చెప్తున్నా.. ధరణిని రద్దు చేస్తే మళ్లీ దరిద్రాన్ని పిలిచినట్లే. ధరణితోని రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. దాన్ని ఇంకింత బాగ చేయనీకి మార్పులు చేస్తున్రు. ధరణి జాగల 36 కాలమ్‌ల పోర్టల్ తెస్తమని కాంగ్రెసోళ్లు చెప్తున్రు. మనం ఎనకట్ల గీ 36 కాలమ్‌ల పహణీ, చౌసాల్ల కత చూడలేదా. దునియా ముంగటికి పోవాలే గని, పాతయి మల్ల తెస్త మని చెప్తున్రు. కాపోళ్లకు తిప్పలు గావొద్దని ధరణి తెచ్చిండు. సరే అండ్ల ఏమన్నా పొరపాట్లు ఉంటే సరిజే స్తున్రు. ధరణితోని ఎంత సౌలత్ అయిందో జనాలకు తెలుస్తలేదా. ధరణి రాకముందు ఎనకట్ల భూములు అమ్మినోళ్లు, కొన్నోళ్లకు అడిగితే ధరణి మంచిదా, కాదా అని చెప్తరు. భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే కొన్ని రోజులు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు చుట్టూ తిరగాలే, అయినంక మల్ల ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరగాలే. అది తెలిసినోడైతేనేమో రిజిస్ట్రేషన్ కాంగానే మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకుని వాళ్ల పేర్ల మీద ఎక్కించుకు నేటోళ్లు. ఈ విషయం తెల్వక చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకుని కాయి దాలు ఇంట్ల పెట్టుకుని పరేషాన్ అయిండ్రు. మ్యూటేషన్ అయిందాక రికార్డులల్ల పేరే ఉంటది. అమ్మినోడు మల్ల ఇంకోళ్లకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిండు. ఇసుంటి డబుల్ రిజిస్ట్రేషన్ కథలు మస్తున్నయి. ధరణి అచ్చిన సంది అవన్నీ బందైనయి. పది నిమిషాల్ల రిజిస్ట్రేషన్ అప్పుడిడప్పుడే రికార్డు లకు పేరెక్కిచ్చి పాస్‌బుక్ గూడ ఇస్తున్రు. దాని గురించి తెలిస్తే అర్థమైతది. ఉత్తగనే బద్నాం చేయొద్దు. వాల్ల రాజకీయాలు ఏమన్న ఉండమ్నీ. మంచి పనిని చెడగొట్టొద్దు.

– మచ్చర్ల సాయిలు, జుకల్, నారాయణఖేడ్ మండలం

- రద్దు చేస్తే పాతరోజులు వస్తాయని రైతుల ఆందోళన
- ధరణిని రద్దు చేస్తామని ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్‌పై కర్షకుల ఆగ్రహం
- దళారుల రాజ్యం తీసుకురావాలని చూస్తున్న కాంగ్రెస్‌పై మండిపాటు
- పటేల్, పట్వారీ వ్యవస్థతో లోపభూయిష్టంగా భూరికార్డుల నిర్వహణ
- సంగారెడ్డి జిల్లాలో ధరణి వచ్చాక 86,858 భూసమస్యలు నమోదు
- 83 వేలకు పైగా పరిష్కరించిన అధికారులు
- భూసమస్య లేకుండా 'ధరణి'ని తీసుకొచ్చిన బీఆర్‌ఎస్‌కే మద్దతంటున్న రైతులు

## ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామన్న.. కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

### ధరణి ఎత్తి వేస్తే రైతులకు గోసే..



ధరణి రద్దు చేసి పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తామని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. ఇది చూస్తు తుంటే పటేల్ పెత్తనం మళ్లీ వస్తుందనిపిస్తుంది. అలా చేస్తే రైతులందరికీ గోసే మొదలవుతుంది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి తొలిగిపోయి మళ్లీ భూ సమస్యలు మొదలవుతయి. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు పెట్టుబడి సాయం పథకాన్ని చూస్తుంటే ప్రతిపక్ష నాయకులకు దిగులుగా ఉన్నట్లున్నది. రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకు చూస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న భూ సమస్యలను తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టుతో తీర్చుకున్నాం. కేసీఆర్‌తోనే వ్యవసాయం పండుగలా సాగుతున్నది.

– గోపతి మాణిక్యం, పసల్‌వాది, సంగారెడ్డి అర్బన్

సంగారెడ్డి, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న 'ధరణి' పోర్టల్‌ను కొనసాగించాలని రైతులు బలంగా కోరుతున్నారు. అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్‌పై సంగారెడ్డి జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామన్న కాంగ్రెస్‌ను బొందపెట్టాలని, మళ్లీ దళారుల రాజ్యం తీసుకురావాలని చూస్తున్నదని రైతులు మండి పడుతున్నారు.

### ధరణి తీసేస్తే అవినీతి పెరుగుతుంది..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తే రెవెన్యూలో అవినీతి పెరుగుతుంది. అటు ఆఫీసర్లు, దళారులు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తది. రైతులు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి సమస్య సుడిగుండంలో పడిపోతారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీలు కొలు రైతుల పొట్ట కొట్టేలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు వేస్తే ధరణిని రద్దు చేసి పాత రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడం ఖాయం. కేసీఆర్ సార్ ప్రభుత్వం రూపొందించిన ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాంగ్రెసోళ్లు పాత పద్ధతిలో పట్వారీ వ్యవస్థను తీసుకురావాలని అనుకోవడం ప్రజలను ఇబ్బందుల్లో నెట్టడమే అవుతుంది.

– కె.నర్సింహులు రైతు, తాటిపల్లి, మునిపల్లి

ధరణి రద్దు చేస్తే తిరిగి పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుందని, భూరికార్డుల నిర్వహణ లోపభూయిష్టంగా మారి రైతులకు అన్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణితో భూరికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉందని ధరణి కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టి ధరణి పోర్టల్‌ను ప్రారంభించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌ను ధరణి పోర్టల్ సింగిల్ విండోగా చెప్పవచ్చు. భూ రికార్డుల నిర్వహణ పూర్తిగా పారదర్శకంగా ఉండేందుకు ధరణిని ప్రారంభించారు. ధరణితో భూరికార్డులను భద్రపరిచే అవకాశం ఏర్పడింది. ధరణితో భూ క్రయవిక్రయాలు పూర్తిగా పారదర్శకంగా జరగడంతోపాటు రైతులకు సత్వరం పట్టాదారు పాసుపుస్తకాలు అందుతున్నాయి. గతంలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు కావాలన్నా, మ్యుటేషన్ కావాలన్నా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. దీనికితోడు పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్ కోసం రైతులు డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. ధరణి పోర్టల్ ప్రారంభంతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్ కష్టాలు తొలిగాయి. భూముల రిజిస్ట్రేషన్ అయిన వెంటనే రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందుతున్నాయి. మ్యుటేషన్ కోసం తిరిగ రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. భూ రికార్డుల నిర్వహణ కూడా సంగారెడ్డి జిల్లాలో సమర్థవంతంగా కొనసాగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో ధరణి పోర్టల్ ప్రారంభంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో సంగారెడ్డి జిల్లాలో మూడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు మాత్రమే ఉండేవి. కాగా ప్రస్తుతం భూముల రిజిస్ట్రేషన్లు అన్ని తహసీల్ కార్యాలయాల్లో చేస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల సంఖ్య 33కు పెరగటంతోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. ధరణి పోర్టల్ ద్వారా 33 లావాదేవి మాడ్యూల్స్ 10 సమాచార మాడ్యూల్స్ అందుబాటులోకి వచ్చాయి. సంగారెడ్డి జిల్లాలో ధరణి వచ్చాక 86,858 భూ సమస్యలు నమోదు కాగా ఇందులో 83వేలలకు పైగా సమస్యలను అధికారులు పరిష్కరించారు.

### పటేల్, పట్వారీలతో భూముల పట్టాలు ఆగమైతవి..

వ్యవసాయ భూములు జాగ్రత్తగా ఉండేందుకు సీఎం కేసీఆర్ ధరణి తీసుకొచ్చారు. కాంగ్రెసోళ్లు ధరణి రద్దు చేస్తామంటున్నారు. పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తెస్తమంటున్నారు. భూముల సమస్యలు పరిష్కారం చేయాలని గతంలో కాంగ్రెస్ సర్కార్‌లో వీఆర్వోల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టికోలేదు. బీఆర్‌ఎస్ సర్కార్ వచ్చినంక ధరణిని తీసుకరావడంతో రైతుల బాధలు తీరినవి. రైతులు ప్రశాంతంగా ఉంటున్నరు. గప్పటి పరిస్థితి మళ్లీ తెస్తే భూముల పట్టాలు తారుమారు చేసే పరిస్థితి వస్తుంది. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ దగ్గర లంచం ఇచ్చే పరిస్థితి ఉండేది. పైసలు ఇవ్వకుంటే పట్టా అయ్యేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీఆర్వోలు, ఎంఆర్వోల దయ మీద పట్టాలు ఆధారపడేవి. సీఎం కేసీఆర్ సారు వచ్చినంక భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మల్లా పాత పద్ధతి తెస్తామంటున్నారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి చేతికి ఓటేస్తే రైతుల పరిస్థితి అధికారుల చేతుల తడపడానికి సరిపోతది. ఎవరు ఎన్ని చెప్పినా ధరణి వల్ల మంచి జరిగిందే తప్ప, చెడు జరుగలేదు. ధరణిని తీసుకొచ్చిన సర్కార్‌కు ఎన్నికల్లో ఆశీర్వదిస్తాం.



– వాసునాయక్, గోటిగార్‌పల్లి తండా, కోహీర్ మండలం



### 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు..



వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు. ఎకరాకు 3గంటల కరెంట్ చాలు అని రేవంత్‌రెడ్డి మాట్లాడటం ఆయన అవివేకం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధరాత్రి పొలానికి కరెంట్ వేసి వచ్చేటోళ్లం. నిద్ర ఉండేది కాదు, ఎరువులు టైంకు అందేటివి కావు. కాంగ్రెస్ హయాంలో శానా తిప్పలు చూసినం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేస్తుండ్రు. రైతుబంధు, రైతుబీమా ఇచ్చి ఆదుకుంటుండ్రు. కాంగ్రెస్‌ని నమ్మితే కష్టాలు తప్పవు. కేసీఆర్ సారే రైతులకు మేలు చేస్తడు. 24గంటల కరెంట్ ఇయ్యటంతో టైంకు పొలానికి నీళ్లు పారిస్తున్నాం. 10 హెచ్‌పీ పెట్టుకునేంత స్థోమత రైతులకు ఉండదు. ఒకవేళ మోటర్ కాలిపోతే రిపేర్‌కే రూ.20వేల దాకా ఖర్చు అవుతుంది. మరోసారి కేసీఆర్‌యే సీఎం అయితడు, ఆయనకే ఓటేస్తం.

– కమ్మెట పోచిరెడ్డి, తెల్లాపూర్, రైతు, రామచంద్రాపురం

### తలకాయున్నోడు అలా మాట్లాడడు..



తలకాయ ఉన్నోడైతే ఎవుసానికి మూడు గంటలు సరిపోతుందని మాట్లాడడు. కాంగ్రెస్ లీడర్లకు అసలు ఎవుసం తెలుసా. రేవంత్‌రెడ్డి ఎవుసం చేశాడా. మూడు గంటలు కరెంటుతోనే పొలం పారుతదంటడు. అదెలా సాధ్యం? ఇగ వాళ్లు మళ్లా గెలిస్తే కరెంటు కోసం రాత్రి పొలం వద్దే పడుకోవాల్సి వస్తది. కరెంటు ఎప్పుడొస్తదో ఎప్పుడు పోతదో తెల్వదు. కేసీఆర్ సార్ 24 గంటల కరెంటు ఇస్తుండు. నాకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. 20 ఏండ్ల నుంచి ఎవుసం చేస్తున్న రెండు ఎకరాల్లో వరి, మరో రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఒక్కటే బోరు ఉన్నది. 24గంటల కరెంటు ఉండబట్టి ఒక్క బోరుతోనే రెండు ఎకరాలకు నీళ్లు పారించుకుంటున్న. రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ మోటరు అంటున్నడు. ఇప్పటిదాక పొలాలకాడ గంత మోటరు సూడలే. 10హెచ్‌పీ మోటరు పెడితో బోరు ఉత్తగనే కాలిపోతది. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలంటే రూ.లక్షకు పైగా ఖర్చువస్తది. ఆ మోటరు ఏం చేస్కోనికే. ఇప్పుడు రైతుల దగ్గర 5హెచ్‌పీ, 3 హెచ్‌పీ మోటార్లే ఉన్నవి. – వంగపల్లి మల్లేశం, కంబాలపల్లి, సదాశివపేట మండలం

### రేవంత్‌ది అంతా ఉత్త ముచ్చటే..



బోర్లకు ఎవ్వలన్నా 10 హెచ్‌పీ మోటర్లు పెడ్తరా? రేవంత్‌రెడ్డి చెప్పేవి నగుబట్ల మాటలు కాకపోతే ఏంది. బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లు బెట్టి నీళ్లు గుంజుతే బోర్లు ఆగుతయా. ఇంకో మాట ఈరాం లేకుండా కరెంటు ఇయ్యంగ 10 హెచ్‌పీ మోటార్లదేం అవసరం? కేసీఆర్ సారు మంచిగ కరెంటు ఇయ్యవట్టే. మనం అదిగాకుండా ఇంకో ముచ్చట చెప్పాలనే ఉద్దేశంతోనే రేవంత్‌రెడ్డి గీ 10 హెచ్‌పీ మోటర్ల సంగతి చెప్తుండనిపిస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లతోని అంతా నష్టమే. కరెంటు ఎక్కువ కాల్తది, నీళ్లు జల్ది గుంజేస్తది. ట్రాన్స్‌ఫోర్ మీద లోడ్ బడి కరాబైతది. దాంతోని గిన్ని తిప్పలుండగా ఏరికోరి 10 హెచ్‌పీ మోటర్లు ఎందుకు బెట్టుకుంటం. అదంతా ఉత్త ముచ్చట రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తుండు గానీ, ఎవుసపోల్ల గురించి ఆలోచిస్తలేదు. వాళ్లు ఎడ్డమంటే నేను తెడ్డమనాలే. ఏమాటకు ఆ మాట చెప్పుకోవాలే. ఉన్నదాన్ని బాగాలేదని చెప్పుడు కూడా తప్పే. అట్లైతే జనాలు కూడా ఒప్పరు. నాకు రెండెకరాల భూతల్లి ఉన్నది. ఉల్లిగడ్డ పండిస్తా. 10 హెచ్‌పీ మోటరు అవసరం లేదు, 5 హెచ్‌పీ మోటరుతోని 24 గంటల కరెంటు ఇస్తే చాలు. ఇదే నా మాట. – సాయిగౌండ, పైడిపల్లి, నారాయణఖేడ్ మండలం

### 24 గంటల కరెంట్‌తోనే రైతులకు మేలు



మూడు గంటల కరెంట్‌తో మా పొలాలు సాగు కావు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంట్‌తో రైతులు బాగుపడరు. మాకు ఉన్న ఎకరన్నర పొలంలో చెరుకు, పత్తితో పాటు ఇతర పంటలను పండిస్తున్నాం. కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ పెట్టి చాలు చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పెలిపోయి, సబ్‌స్టేషన్‌లోని పరికరాలు కాలిపోతాయి. ఇప్పుడున్న ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో 5 హెచ్‌పీ పంపు సెట్లను వాడుతున్నాం. అవసరమున్న పొలానికి వెళ్లి పంటలకు నీటి తడులను అందించి హాయిగా నిద్రపోతున్నాం. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓట్లేస్తే మళ్లీ తెలంగాణ వందేండ్ల వెనక్కి వెళ్తుంది. సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న కరెంట్‌తోనే రైతులకు మేలు జరుగుతుంది.

– మారుతి, రైతు, గుంజోట్టి, న్యాల్‌కల్ మండలం

### గిరాకీ తగ్గినా రైతులు సుఖంగా ఉన్నరు..

సమైఖ్య రాష్ట్రంలో లోవోల్టేజీ సమస్యతో రైతులు అనేక ఇబ్బందులు పడేవాళ్లు. పంటసాగు చేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేదాకా కంటి కిరెప్పలా కాపాలా కాస్తుండె. కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియక పొలాల వద్ద రాత్రింబవళ్లు కాపాల కాసేది. వచ్చిన కరెంటు కూడా మోటర్లకు సరిపోను లేకపోవడంతో మాటిమాటికి రిపేరుకు వచ్చేవి. ఓవైపు లోవోల్టేజీ కరెంటు మరోవైపు మాటిమాటికి మోటర్లు రిపేరుకు తీసుకువచ్చే రైతులు తమ బాధలు చెప్పుకుంటూ బాధపడేవారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ నిరంతరం రైతుల మేలుకోసం కృషి చేస్తుండటంతో ఇప్పుడా ఇబ్బందులు అన్ని తీరినయ్. మోటర్లు బాగుచేసే పనితగ్గి గిరాకీ తగ్గినా, రైతులు సంతోషంగా ఉంటున్నారు.



– ఆకుల కుమార్, మోటర్ వైండింగ్ మెకానిక్, హత్నూర

## కాంగ్రెస్ పాలనంటే.. కాలిన మోటర్లు.. పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు

కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు అన్నీ ఇన్ని కావు

లోవోల్టేజీతో కాయిపోయిన మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు

వాటి బాగుకోసం రోజుల తరబడి పడిగాపులు

ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



- పంటలు ఎండిపోయి ఆర్థికంగా చితికిపోయిన రైతులు
- రాత్రిపూట విద్యుత్ సరఫరాతో పాముకాటుతో రైతుల మృతి
- కేసీఆర్ సర్కారు వచ్చాకే తీరిన కరెంటు కష్టాలు
- వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా
- ఉచిత విద్యుత్‌తో తప్పిన బిల్లుల భారం
- ఈ తొమ్మిదేండ్లలో సంతోషంగా సాగుతున్న ఎవుసం

సంగారెడ్డి, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అంటేనే రైతులు ఉలిక్కిపడుతున్నారు. కాంగ్రెస్‌పాలనలో తాము అనుభవించిన కరెంటు కష్టాలు రైతులను ఉలికిపాటుకు గురిచేస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించింది. అయితే 24గంటల విద్యుత్ సరఫరా కార్యరూపం దాల్చలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేసిన రైతులు ఆ తర్వాత కరెంటు కష్టాలు ఎదుర్కొవాల్సి వచ్చింది. 24గంటల కరెంటు స్థానంలో నిరంతరంగా ఆరు గంటల విద్యుత్ కూడా సరఫరా చేయలేక పోయింది. పగటిపూట మూడు గంటలు, రాత్రిపూట మూడు గంటల విద్యుత్ సరఫరా అవటంతో రైతులు అప్పట్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రాత్రిపూట కరెంటు ఉండటంతో రైతులు బోరుబావుల వద్దే నిద్ర పోవాల్సి వచ్చేది. రాత్రిపూట బోరుమోటరు ఆన్ చేయటానికి వెళ్లి పాముకాటుకు గురై రైతులు చనిపోయిన ఘటనలు సంగారెడ్డి జిల్లాలో అనేకం ఉన్నాయి. లోవోల్టేజీ సమస్య రైతులను పట్టి పీడించింది. కరెంటు సరిగ్గా సరఫరా కాకపోవటంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేందుకు రైతులు కరెంటు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివచ్చేది. కరెంటు సరఫరా లేకపోవటంతో బోరుబావుల కింద పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోయారు. కొంతమంది రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. నిరంతర విద్యుత్ సరఫరా కోసం రైతులు ధర్నాలకు దిగటంతోపాటు ట్రాన్స్‌కో సిబ్బందిని పంచాయతీ కార్యాలయాల్లో బంధించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ట్రాన్స్‌కోకు అరకొరగా నిధులు విడుదల చేయటంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం అటకెక్కింది. కాంగ్రెస్ హయాంలో 2014కు ముందు సంగారెడ్డి జిల్లాలో 68,048 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండేవి. 68,048 బోరుబావులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం అదనపు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు వేయాల్సి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లాలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఒక్కటి ఉండేది, 132 కేవీ సబ్‌స్టేషన్లు పది, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 17 మాత్రమే ఉండేవి. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలంటే రైతులు ఇబ్బందులు పడేవారు.

### శేండ్లకు మూడు గంటలు సరిపోదు..



మూడు గంటల కరెంట్ శేండ్లకు ఎట్లా సరిపోతదో రేవంత్‌రెడ్డి రైతులకు సమాధానం చెప్పలే. 24 గంటల కరెంట్ ఇవ్వంతోనే ఇప్పుడు రైతులు ఎదార్థంగా బతుకుతున్నరు. లేనిపోని మాటలు చెప్పి రైతులను నిండా ముంచేతందుకే కొత్త కథ సురువుజేసినారు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్ముకుంటే రైతులు మల్లా రాత్రి కరెంట్ ఒక్కడవయేరో అంటు పాము, తేలు కాట్లకు గురై అక్కడే సచ్చినా సస్తం. సాధ్యం కాని హామీలు ఇచ్చి రైతులను మోసం చెయ్యాలని చూస్తున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఫ్యూజ్‌లు ఉంటాయా? ఎగిరి పోతయ్. దిక్కుమాలిన కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవద్దు. రైతులు ఆలోచించి కేసీఆర్‌కే మళ్లీ ఓటేస్తం.

– తలారి సంజీవులు, రైతు మాందాపూర్, కొండాపూర్

### కేసీఆర్ పాలనలో విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం

సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సంగారెడ్డి జిల్లా రైతుల కరెంటు కష్టాలు తీరిపోయాయి. సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లాలో విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. రూ.1065.77 కోట్ల నిధులతో జిల్లాలో కొత్త సబ్‌స్టేషన్లు, కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త విద్యుత్‌లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు జిల్లాలో 1.01 లక్షలకు చేరుకుంది. వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వం రూ.163.7 కోట్ల వ్యయంతో 32,740 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చింది. కేసీఆర్ పాలనలో రైతులకు కరెంటు కష్టాలు తప్పటంతోపాటు ఉచిత విద్యుత్ సరఫరాతో రైతులపై కరెంటు బిల్లుల భారం లేకుండా పోయింది.

### 3 గంటల కరెంట్‌తో మూడు మడులు కూడా పారయి



మూడు గంటల కరెంట్‌తో మూడు మడులు కూడా పారయి. కాంగ్రెసోళ్లు మతి లేకుండా మాట్లాడుతున్నారు. 3గంటల కరెంట్‌తో రేవంత్‌రెడ్డి ఎన్ని ఎకరాల పంటను తీస్తాడో చెప్పాలి. తెలంగాణ ప్రభుత్వం 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తుంటే ఓర్వలేక ఓట్ల కోసం పిచ్చికూతలు కూస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు చాలు. మమ్మల్ని మళ్లీ ఇబ్బందుల్లోకి నెట్టే కూతలు మానాలి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి సముద్రం నుంచి నీటిని తీయాల, వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమో లేదో కూడా తెలియని పరిస్థితి కాంగ్రెస్సోళ్లది. 24 గంటల కరెంట్ ఇచ్చిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలంగాణ ప్రభుత్వమే. రైతుల బాగు కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం. రైతుల మేలు కోరే బీఆర్‌ఎస్‌కే నా మద్దతు.

– చిద్రుప్ప నర్సింహులు రైతు, చిమ్నాపూర్, కంది మండలం

### కరెంటు కష్టాలు మొదలైతయ్..



3 గంటల కరెంట్ వస్తే రైతులకు తిప్పలు తప్పవు. ఇప్పుడు సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తుండు. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. పంటలు సజావుగా పండిస్తున్నం. పంటలకు నీటి కొరత లేకుండా పోయింది. రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంటు ఇస్తే సరిపోతుంది, రైతులు 10హెచ్‌పీ మోటర్లు బిగిస్తే సరిపోతుందంటుండు. 10 హెచ్‌పీ మోటర్ బిగిస్తే ఉన్న పైప్‌లైన్ ఏం జెయాలె? మళ్లీ కొత్త పైప్‌లైన్ వేయాలంటే ఖర్చు భారీగా పెరుగుతుంది. 3గంటల కరెంటు ఇవ్వడంతో కరెంటు అందక మోటర్లు కాలి పోతవి. కరెంటు కోసం రాత్రి పగలు కావలి ఉండాల్సి వస్తది.

– బేగరి సైదప్ప, దోసపల్లి, మనూరు మండలం

### మూడు గంటలతో మోటర్లు కాలిపోవుడే..



కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంటు ఇస్తే బోరుబావుల వద్ద ఉన్న మోటర్లు కాలిపోవుడే. పంటలకు నీళ్లు పెట్టేందుకు రైతులందరూ ఒకేసారి మోటర్లను స్టార్ట్ చేస్తరు. అప్పుడు లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుంది. మోటర్ల మీద లోడ్ ఎక్కువై మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. అప్పుడు వాటిని రిపేర్ చేసుకునేందుకు మెకానిక్‌ల చుట్టూ తిరుగాలి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలు చేస్తున్న నిరంతర విద్యుత్ సరఫరాతో రైతులు చాలా సంతోషంగా ఉన్నరు. మా బావి వద్ద ఉన్న మోటరు 10 ఏండ్లు అయినా కాలిపోలేదు. క్వాలిటీ కరెంటు ఉంటున్నది.

– మంతూరి జైపాల్‌రెడ్డి, రైతు, కోహీర్

### కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాతరోజులొస్తాయి

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ పాతరోజులను తీసుకువచ్చేందుకు కుట్ర పన్నుతున్నది. సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకోంటున్నారు. మా బతుకులు బాగుండడం కాంగ్రెస్ నాయకులకు ఇష్టం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్‌తోనే 10 హెచ్‌పీ మోటర్లతో పొలానికి నీటిని పారించవచ్చని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పడం అవివేకం. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం గోసలు పడ్డం. ఆ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ రోడ్డెక్కి కరెంట్ కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పుడున్న 24 గంటల కరెంట్‌తో అవసరం ఉన్నప్పుడు వెళ్లి పంటలకు నీరందిస్తున్నా. నాకున్న 4 ఎకరాల పొలంలో అల్లం, బొప్పాయి, చెరుకు, పత్తి పంటలను పండిస్తున్నా. వ్యవసాయం మీద అవగాహన లేని కాంగ్రెస్ నాయకులకు రైతుల పని, వారి అవసరాల గురించి ఎలా తెలుస్తాయి. అందుకే 24 గంటల కరెంట్ సరఫరా చేసే సీఎం కేసీఆర్ సార్‌కు అండగా ఉంటాం.

– గొల్ల వీరేశం, రైతు, న్యామతాబాద్, న్యాల్‌కల్ మండలం

